

జిల్లా కేంద్రంలో ఓటు హక్కు వినియోగంపై ప్రచారం చేస్తున్న కళాకారులు

## ఓటు హక్కు వినియోగంపై అవగాహన

జనగామ, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య ఆదేశాలతో జిల్లాలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్వీప్ నోడల్ ఆఫీసర్ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జనగామ పట్టణంలోని జనగామ చౌరస్తా, కోర్టు సెంటర్, వివిధ వార్డుల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై క్షేత్రస్థాయి ప్రచారాన్ని డీపీఆర్‌వో రాజేంద్రప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. మూడు నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం సహా ఆయా నియోజకవర్గాల్లోని ప్రధాన కూడళ్లలో హోర్డింగులు, ఫ్లెక్సీలు ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్క రూ తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని సూచించా రు. తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు రత్నం, శంకర్, గణేశ్, సంజీవ, కనకరాజు, చందు, సోమయ్య, స్వప్న, పద్మ, మమత, రంజాన్‌బీ పాల్గొన్నారు.



పల్లాతో ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు

## పల్లాను కలిసిన జిల్లా ముదిరాజ్ నాయకులు

**నామినేషన్ ఖర్చులకు రూ.2016అందజేత**

జనగామ రూరల్, నవంబర్ 3 : జనగామ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో జిల్లా ముదిరాజ్ మహాసభ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్లా నామినేషన్‌కు రూ.2016లను అందజేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ జిల్లాలోని ముదిరాజ్‌లు బీఆర్‌ఎస్ అభ్యర్థులకు అండగా ఉండాలన్నారు. పల్లాను కలిసిన వారిలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, ముదిరాజ్ మహాసభ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చినబోయిన రేఖారాజు, జిల్లా చీఫ్ ప్రమోటర్ నీల రాజు, డైరెక్టర్లు నీరాటి సుధాకర్, నిమ్మల స్వామి, మండలంలోని మత్స్యశాఖ అధ్యక్షులు, కార్యదర్శులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## 'క్రీస్తుజ్యోతి' అధ్యాపకుడికి డాక్టరేట్



యాకూబ్‌ను అభినందిస్తున్న ఫాదర్ విజయ్‌పాల్‌రెడ్డి

జనగామ రూరల్, నవంబర్ 3 : మండలంలోని యశ్వంతాపూర్ గ్రామంలోని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు కొలిపాక యాకూబ్‌కు డాక్టరేట్ అవార్డు రావడం సంతోషంగా ఉందని కళశాల డైరెక్టర్ ఫాదర్ విజయ్ పాల్ తెలిపారు. పర్ఫార్మెన్స్ ఎవాల్యుయేషన్ ఆఫ్ సోలార్ కుక్కర్ యూజింగ్ ఎనర్జీ అనాలిసిస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ లభించిందని తెలిపారు. ఈ అవార్డును ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 83వ కాన్వొకేషన్‌లో తెలంగాణ గవర్నర్ తమిళిసై, ఉపకులపతి ప్రొఫెసర్ డా. దండెబోయిన రవీందర్, అడోబ్ కంపెనీ సీఈవో శంతను నారాయణ్‌లు యాకూబ్‌కు ప్రదానం చేశారు. యాకూబ్‌ను కళాశాల యాజమాన్యం అభినందించి సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరిపై కేసు నమోదు

తరిగొప్పుల, నవంబర్ 3 : మండల కేంద్రనికి చెందిన తాళ్లపల్లి కళావతి, తాళ్ల పల్లి రజిని ఎన్నికల కోడును ఉల్లంఘించి బెల్ట్‌షాపు నడిపిస్తున్నట్లు అందిన పక్కా సమాచారం మేరకు వారి ఇళ్లలో తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఈ తనిఖీల్లో రూ.4500 విలువ గల మద్యాన్ని స్వాదీనం చేసుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.



చేర్యాలలో వృద్ధురాలిని ఓటు అడుగుతున్న పల్లా నీలిమా



చేర్యాలలో ప్రచారం చేస్తున్న పల్లా అనురాగ్‌రెడ్డి



చేర్యాలలో డప్పుకొట్టి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తాటికొండ

# యువతను బలితీసుకున్న కాంగ్రెస్‌ను నమ్మొద్దు

- ఇంటి పార్టీ బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి..
- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
- బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం చేర్యాలలో విస్తృత ప్రచారం
- ఓటర్లను కలిసిన ఎమ్మెల్యే తాటికొండ, పల్లా సతీమణి నీలిమ, తనయుడు అనురాగ్‌రెడ్డి



చేర్యాలలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

చేర్యాల, నవంబర్ 3 : తెలంగాణ కోసం జరిగిన ఉద్యమాల్లో వేలాది మంది యువకులను బలితీసుకున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మొద్దని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాజా సర్వే ప్రకారం సీఎం కేసీఆర్ 90నుంచి100 సీట్లు సాధించడం ఖాయమని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం 7,8,9,10వ వార్డులలో బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలతో కలిసి ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, రాష్ట్ర ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, జనగామ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమా, కుమారుడు అనురాగ్ రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. వారికి ఆయా వార్డుల మహిళలు బతుకమ్మ, బోనాలతో ఎదురేగి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా వార్డుల్లో ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం స్థానిక వాసవి గార్డెన్ సమీపంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వలేదని, సీఎం కేసీఆర్ ఉద్యమంతో తప్పని పరిస్థితి తెలంగాణ ఇచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో దేశంలో అగ్రస్థానంలో ఉందన్నారు. కాంగ్రెస్ చేసే అసత్య ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఇప్పటికే కర్ణాటక ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలతో ఓట్లు వేయించుకుని హామీలు నెరవేర్చలేదన్నారు. చేర్యాల పట్టణంలో 15వేల ఓట్లలో ప్రభుత్వ పథకాలు పొందిన వారు 14వేల పైచిలుకుగా ఉన్నారని, వారు తప్పక బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. రానున్న ఎన్నికలలో 100సీట్లు సాధించి సీఎం కేసీఆర్ మరో చరిత్ర సృష్టించబోతున్నట్లు తెలిపారు. చేర్యాల పట్టణం సమగ్రాభివృద్ధి బీఆర్‌ఎస్ పాలనలో జరిగిందని, పెండింగ్ అభివృద్ధి పనులను ప్రభుత్వం ఏర్పాటు కాగానే పూర్తి చేయించే బాధ్యత తమపై ఉందన్నారు.

**సీఎం కేసీఆర్ పాలనలో రైతేరాజు.. ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య**


కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేదని, అదే సీఎం కేసీఆర్ పాలనలో రైతు రాజు అయ్యాడని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తెలిపారు. ప్రచారంలో భాగంగా చేర్యాలలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం నల్లేరు మీద నడకే అవుతుందన్నారు. కేసీఆర్ తాజాగా ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో అన్నివర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు అన్ని విధాలుగా మేలు చేసిన సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఏనాడూ కాంగ్రెస్ పార్టీ పాటుపడలేదన్నారు.

**చేర్యాల రెవెన్యూ డివిజన్ ఖాయమైంది : పల్లా నీలిమా**

చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూ ళ్మిట్ట మండలాలతో చే ర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం ఖాయమైందని జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి పల్లా నీలిమా తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు వార్డులలో ఆమె విస్తృత ప్రచారం చేశారు. రానున్న ఎన్నికలో పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయిస్తామన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను పొందని వారు లేరన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మొదటి నుంచీ కష్టపడి పనిచేసే వ్యక్తని, జనగామ, చేర్యాల ప్రాంతాలను ప్రణాళిక ప్రకారం సమగ్రంగా అభివృద్ధి చేస్తారని తెలిపారు. భారీ మెజార్టీతో పల్లాను గెలిపిచాలని కోరారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, వైస్‌చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, జిల్లా గ్రంథాలయ కమిటీ సభ్యుడు మేడిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీశ్, మంగోలు చంటి, యాట కనకమ్మ, జుబేదాఖతాన్‌ఎక్బాల్, బీఆర్‌ఎస్‌వై నాలుగు మండలాల ఇన్‌చార్జి శివగారి అంజయ్య, మైనార్టీ సెల్ ఇన్‌చార్జి బీరెడ్డి ఇన్నారెడ్డి, సీనియర్ నాయకుడు మంచాల కొండయ్య, టౌన్ అధ్యక్షురాలు తాడెం రజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల మానస, మేడిశెట్టి ఉమాదేవి, యూత్ అధ్యక్షుడు యాట భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## 'పల్లా' సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు

బచ్చన్నపేట, నవంబర్ 3 : బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన మైనార్టీలు శుక్రవారం జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ తాతిరెడ్డి భవానీశశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎండీ సయ్యద్ నేతృత్వంలో మైనార్టీ పెద్దలు షేక్ హైదర్‌సాబ్, గౌరీమియా, కాశీం, గఫూర్, మునీర్, అప్సర్, సత్తార్, ఉస్మాన్, సాజిద్, షరీఫ్, అన్వర్, మున్నా, హుస్సేన్, ఇబ్రహీం తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లా రాజేశ్వర్ రెడ్డి స్థానికుడు కాదని అనడం సిగ్గు చేటన్నారు. ఆంధ్రా నుంచి వచ్చాడా ? లేక ఇతర ప్రాంతం నుంచి వచ్చాడా ? ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లా ముద్దు బిడ్డ అని తెలిపారు. పూటకో పార్టీ మారే కొమ్మూరి ప్రతాపరెడ్డిపై ప్రజల్లో నమ్మకం లేదన్నారు. మూడు పార్టీలు మారిన కొమ్మూరి కావాలా..? నిరంతం కరెంటు, సాగు, తాగునీరు, పథకాలు అందించే బీఆర్ ఎస్ కావాలో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం కోసం నిరంతరం శ్రమిస్తామన్నారు. ఉపసర్పంచ్ బూడిద శ్రీనివాస్‌గౌడ్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గొల్లపల్లి మల్లేశంగౌడ్, నాయకులు సయ్యద్, సర్దార్, ఫరీద్, చిన్న సర్దార్, అబ్దుల్లా పాల్గొన్నారు.



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## అక్రమ మద్యం సరఫరాపై ప్రత్యేక నిఘా

- ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూం, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు
- జిల్లా ఎక్సైజ్ అధికారిణి కృష్ణప్రియ వెల్లడి

జనగామ, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో కల్తీ మద్యం, అక్రమ మద్యం సరఫరా, భారీ నిల్వలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి ఎస్ కృష్ణప్రియ తెలిపారు. ప్రజలను మరింత అప్రమత్తం చేయడం సహా కల్తీ మద్యం, అక్రమ మద్యం సరఫరా, నిల్వలపై నిఘా పెంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, సమాచారం కోసం ఎక్సైజ్‌శాఖ రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2523ను, జనగామ జిల్లా పరిధిలో కంట్రోల్ రూం నంబర్ 9014017705 కు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ ఈఎస్ కృష్ణప్రియ కోరారు. వినియోగదారులు వైన్‌షాప్‌ల నుంచి కొనుగోలు చేసిన మద్యం సరైనదేనా? కాదా? తెలుసుకునేందుకు వీరిట్ మొబైల్ యాప్ ద్వారా స్కాన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఈ యాప్ ద్వారా మద్యం బాటిల్ మూతపై ఉన్న హోలోగ్రాంను స్కాన్ చేస్తే బాటిల్ బ్రాండ్, పరిమాణం, ఎమ్మార్పీ, బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, బాటిల్ జారీ చేయబడిన డిపో, వైన్ షాప్ పేరు డిస్ప్లే అవుతుందన్నారు. ఒకవేళ మద్యం నకిలీదైనా, అక్రమ మద్యం అయినా ఎలాంటి వివరాలు కనిపించవని 'వీరిట్' మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.